క్లుప్తంగా

ప్రధానార్చకుడికి విశ్వగురు ఉగాది పురస్కారం



ఇంద్రగంటి లక్ష్మీ నరసింహమూర్తి

అన్నవరం: సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి లక్ష్మీ నరసింహమూర్తిని హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ విశ్వగురు ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శుక్రవారం సమాచారం పంపించారు. ఈ ఏడాది అర్చకత్వం విభాగంలో ఇంద్రగంటిని ఎంపిక చేశామని తెలిపారు. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆయనకు ఆదివారం ఉదయం ఈ పురస్కారం అందజేయనున్నామని పేర్కొన్నారు.

గ్రీన్ ఇండియా ర్యాంకింగ్స్‌లో 'ఆదిత్య'కు ఏ గ్రేడ్



ఆదిత్య కళాశాలల వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

గండేపల్లి: జాతీయ స్థాయి గ్రీన్ ఇండియా ర్యాంకింగ్స్ 2023 సర్వేలో మండలంలోని సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థలకు ఏ గ్రేడ్ వచ్చినట్టు కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి శుక్రవారం తెలిపారు. గ్రీన్ ఇండియా ర్యాంకింగ్స్ 2023 సర్వేలో సస్టైనబుల్ ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఇండియా ర్యాంకింగ్స్ 2023లో అత్యుతమ కళాశాలగా గ్రేడ్ ఏ, ఇన్స్టిట్యూషన్స్ బ్రాండ్ కేటగిరిలో గోల్డ్ కేటగిరి సాధించిందని వివరించారు. ఎనర్జీ కన్జర్వేషన్, సోలార్ ఎనర్జీ, రీసెర్చ్ అవుట్ కమ్, ఎన్ఏఏసీ గుర్తింపు, ఎన్‌బీఏ, ఇతర ర్యాంకింగ్స్, అధ్యాపకుల మెరిట్, తదితర ఆధారంగా దేశవ్యాప్తంగా జరిగిన సర్వేలో తమ కళాశాలలు మంచి గుర్తింపు పొందినట్టు తెలిపారు.

ఆరోగ్య మిత్రలకు వైద్య సేవలపై అవగాహన

జగ్గంపేట: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందిస్తున్న వైద్యసేవలపై ఆరోగ్యమిత్రలకు మరింత అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త పి.రాధాకృష్ణ, స్థానిక సీహెచ్‌సీ డాక్టర్లు రమేష్, భాను తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జగ్గంపేట సీహెచ్‌సీలో ఆరోగ్య మిత్రలకు ఆరోగ్యశ్రీ ట్రైనింగ్ మాన్యువల్ బుక్లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ కె.నవీన్, టీమ్ లీడర్ సువర్ణ, ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆలయానికి శంకుస్థాపన

జగ్గంపేట: స్థానిక కోనేటి వీధిలో వేంచేసిన నూకాలమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ పరంగానూ, వ్యక్తిగతంగానూ సహకరిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత జ్యోతుల రామస్వామి, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రత్తిపాడు రూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు తెలిపారు. మండలంలోని ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 140 మంది 10 తరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ నేత రామిశెట్టి బులిరామకృష్ణ ఆర్థికం సాయంతో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు

తొండంగి: టీడీపీలో కష్ట పడిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. మండలంలోని పైడికొండంలో టీడీపీ కార్యకర్తలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి యనమల కృష్ణుడు, పోల్నాటి శేషగిరిరావు, ఇనుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యుల రాజీనామా

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామ పంచాయతీకి చెందిన నలుగురు వార్డు సభ్యులు శుక్రవారం రాజీనామా చేశారు. పంచాయతీకి చెందిన 2, 3, 6, 12 వార్డు సభ్యులైన ఆకుల గంగాభవానీ, పెంటకోట కృష్ణ, బద్దిరెడ్డి సూర్యనాగకల్యాణి, బద్దిరెడ్డి సుబ్బలక్ష్మి తమ వార్డు పదవులకు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కేఎస్ఎన్ మూర్తికి అందజేశారు. గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సీసీ రోడ్డు నిమిత్తం రూ.5 లక్షలను నిధులు మంజూరు చేశారని, ఈ నిధులకు పంచాయతీ తీర్మానం ఇవ్వకపోవడంతో సర్పంచ్ వైఖరికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఎంపీడీఓను సంప్రదించగా నలుగురు వార్డు సభ్యులు రాజీనామా పత్రాలు సమర్పించారన్నారు.

పన్నుల వసూలు.. దిగాలు

- పంచాయతీల్లో పూర్తిస్థాయిలో వసూలు కాని ట్యాక్స్
- ముగిసిన ఆర్థిక సంవత్సరం
- డివిజన్‌లో సరాసరి 73.78 శాతం ఆస్తి పన్ను వసూలు



తుని మండలం వల్లూరు, అగ్రహారాల్లో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

తుని రూరల్: ఆర్థిక సంవత్సరం ముగిసినప్పటికీ గ్రామాల్లో ఆస్తి (ఇంటి) పన్ను వసూలు పూర్తికాలేదు. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన ఎనిమిది నెలలు వరకూ డిమాండ్ సిద్ధం చేయకపోవడంతో పన్నుల వసూలు చేపట్టలేదు. ఆర్థిక సంవత్సరం ముగింపులో పన్నుల వసూలు చేపట్టడంతో నిర్దేశించిన లక్ష్యాలను పంచాయతీ సిబ్బంది చేరుకోలేకపోయారు. పూర్వంతో పోల్చితే ఈ సంవత్సరం వసూళ్లలో ప్రగతి కనిపించిందని పంచాయతీ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. పాత బకాయిల్లో 70.86 శాతం, డిమాండ్‌లో 75.83 శాతం ఆస్తి పన్ను వసూళ్లు జరిగాయి. ఎంపీడీఓలు, ఈఓపీఆర్ అండ్ ఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో పన్నులు వసూలు చేసి లక్ష్యానికి చేరువయ్యారు. ఆర్థిక సంవత్సరం పూర్తయినప్పటికీ గ్రామాల్లో పన్ను బకాయిలు వసూళ్ల ప్రక్రియను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఆస్తి పన్నుల నిధులు కీలకపాత్ర వహిస్తాయి. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డివిజన్‌లో రూ.14.25 కోట్ల వసూలు

పెద్దాపురం డివిజనల్ పరిధిలో 11 మండలాలు ఉన్నాయి. ఆయా పంచాయతీల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలు కావాల్సిన మొత్త రూ.19.31 కోట్లు. ఇందులో 2022-23 సంవత్సరానికి రూ.11.35 కోట్లు, పాత బకాయిలు రూ.7.96 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. మొత్తం డిమాండ్‌లో ఇప్పటివరకూ రూ.14.25 కోట్లు (73.78 శాతం) వసూలు అయ్యాయి. ఇందులో 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.8.61 కోట్లు, పాత బకాయిలు రూ.5.64 కోట్లు వసూలైంది. ఇంకా రూ.5.06 కోట్లు వసూలు కావలసి ఉంది. ఆ ఆర్థిక సంవత్సరం ముగియడంతో మిగిలిన మొత్తాన్ని 2023-24లో పాత బకాయిలుగా వసూలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మండలాల వారీగా ఆస్తి పన్ను డిమాండ్, వసూళ్ల శాతం

మండలం	పాత, కొత్త డిమాండ్	వసూలైన మొత్తం	శాతం	బకాయిలు
గండేపల్లి	రూ1,42,92,588	రూ.1,15,17,399	80.58	రూ.27,75,189
జగ్గంపేట	రూ.1,62,56,230	రూ.1,24,31,931	76.47	రూ.38,24,299
కిర్లంపూడి	రూ. 1,77,40,467	రూ.1,19,12,631	67.15	రూ.58,27,836
కోటనందూరు	రూ.74,02,776	రూ.59,47,652	80.34	రూ.14,55,124
పెద్దాపురం	రూ.2,03,34,632	రూ.1,54,81,475	76.13	రూ.48,53,157
ప్రత్తిపాడు	రూ.2,16,50,944	రూ.1,39,11,984	64.26	రూ.77,38,960
రౌతులపూడి	రూ.1,01,31,670	రూ.78,97,188	77.95	రూ.22,34,482
శంఖవరం	రూ.1,63,45,913	రూ.1,33,20,671	81.49	రూ.30,25,242
తొండంగి	రూ.3,33,17,049	రూ.2,48,59,552	74.62	రూ.84,57,497
తుని	రూ.2,05,36,845	రూ.1,38,02,378	67.21	రూ.67,34,467
ఏలేశ్వరం	రూ.1,51,53,998	రూ.1,14,28,070	75.41	రూ.37,25,928
మొత్తం	రూ.19,31,63,112	రూ.14,25,10,931	73.78	రూ.5,06,52,181

ప్రత్యేక బృందాలుగా వసూళ్లు



పూర్వంతో పోల్చితే ఈ సంవత్సరం ఇంటి పన్ను వసూళ్లు బాగున్నాయి. కార్యదర్శులకు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సహకరిస్తున్నారు. వసూళ్లకు ప్రజల నుంచి స్పందన బాగానే ఉంది. వంద శాతాన్ని వసూలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో పని చేస్తున్నాం. తుని మండలం చేపూరు గ్రామస్తులు పదేళ్లగా వంద శాతం పన్నులు సకాలంలో చెల్లిస్తున్నారు. ఈ సంవత్సరం రూ.2,51,958 (వంద శాతం) చెల్లించడం అభినందనీయం. ఇదే స్ఫూర్తిలో అన్నిగ్రామాలకు చెందిన ప్రజలు చెల్లించి ఆదర్శంగా నిలవాలి.

– ఎస్.జయరామ్, ఈఓపీఆర్డీ, తుని

రైతులకు అండగా సొసైటీ



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ బాబీ

గండేపల్లి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) పరిధిలోని రైతులందరికీ అండగా ఉంటామని సొసైటీ అధ్యక్షుడు కేతిన వెంకన్నచౌదరి (బాబీ) తెలిపారు. సొసైటీ భవనంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా ఇప్పటికే 30 మంది రైతులకు సుమారు రూ.90 లక్షల వరకూ రుణాలు అందించామన్నారు. మరో రూ.50 లక్షల రుణాలు ఇచ్చేందుకు సొసైటీ సిద్ధంగా ఉందని తెలిపారు. గత పాలకవర్గంలో జరిగిన అవకతవకలను అధిగమించి రైతుల అభివృద్ధే ధ్యేయంగా సొసైటీ పని చేస్తోందన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సకాలంలో రుణాలు చెల్లించిన రైతులకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు.

గతంలో రూ.23 కోట్ల అవకతవకలు

గత పాలకవర్గ హయాంలో గండేపల్లి సొసైటీలో రూ.23 కోట్ల అవకతవకలు జరిగాయని ఆయన ఆరోపించారు. వీటిని అధికమించి సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు.

దళితుల అభ్యున్నతికి పెద్దపీట

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- బొద్దవరంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన



బొద్దవరంలో ఎస్సీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసిన మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: దళితుల అభ్యున్నతికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మండలంలోని బొద్దవరంలో శుక్రవారం మంత్రి రాజా పర్యటించారు. మంత్రి దాడిశెట్టి రాజాకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాణసంచా కాల్పులు, డప్పు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10 లక్షలతో నిర్మించే ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి సర్పంచ్ వేగి లక్ష్మితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ దళితులను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందిస్తోందన్నారు. గ్రామాల్లో ఎస్సీ కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. స్థానికులు పలు సమస్యలను మంత్రి రాజా దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం రామాలయంలో శ్రీసీతారాములను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తాండవనది అవతల భాగంలో ఉన్న వ్యవసాయ మకాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నామని, తాండవనదిపై వంతెన నిర్మించాలని ఆ గ్రామ రైతులు మంత్రి రాజాకు విజ్ఞప్తి చేశారు. సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచామని, వీలైనంత త్వరలో బ్రిడ్జి నిర్మాణం చేపతామని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర డైరెక్టర్ లంక ప్రసాద్, సొసైటీ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, యల్లపు దొరబాబు, కోఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, తహసీల్దార్ శివకుమార్, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగు అధికారులకు సత్కారం

జగ్గంపేట: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ జిల్లాలోనే ఉత్తమ అధికారులుగా ఇటీవల అవార్డులు అందుకున్న వెలుగు సిబ్బందిని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ పద్మావతి, జగ్గంపేట వెలుగు ఏపీఎం జగదీశ్వరని స్వయం సహాయక సంఘాల సభ్యులు సమక్షంలో శాలువా, పూలమాలతో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సత్కరించారు. విధినిర్వహణలో మరింత చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



తుని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

తుని: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎన్నికల పరిశీలకుడు జి.బాలాజీ రావు సూచించారు. స్థానిక దివాణపు వీధిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శుక్రవారం తుని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడు స్థానానికి ప్రగడ చక్రరావు, కాలిబోయిన సూరిబాబు నామినేషన్లు దాఖలు చేయగా మిగిలిన పదవులు ఏకగ్రీవమయ్యాయి. తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రగడ చక్రరావు, ఉపాధ్యక్షుడిగా బర్ల రవికుమార్, కార్యదర్శిగా పెండ్యాల శ్రీనివాస్, కోశాధికారిగా మామిడి విజయలక్ష్మి, సహాయ కార్యదర్శిగా చిట్రా రాజేష్, మహిళా ప్రతినిధిగా బి.లోవకుమారి, క్రీడా కార్యదర్శిగా ఆర్‌కే చలపతిరావు, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్‌సీహెచ్‌వీ నారాయణాచార్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం పదవీ కాలం ఏడాది పాటు ఉంటుందని బాలాజీరావు తెలిపారు. న్యాయవాదుల సమస్యల సాధనకు కృషి చేస్తామని సంఘ నూతన అధ్యక్షుడు చక్రరావు తెలిపారు. పలువురు న్యాయవాదులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

- ఎంపీ వంగా గీత
- కిర్లంపూడిలో మల్టీపర్పస్ భవనానికి శంకుస్థాపన



కిర్లంపూడిలో మల్టీపర్పస్ భవనానికి శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: రాష్ట్రంలోని అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక ఎస్సీ పేటలో మల్టీపర్పస్ భవనానికి శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు ఎస్సీ కాలనీలో మల్టీపర్పస్ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.20 లక్షలు కేటాయించామన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పరిశీలన

జగపతినగరంలో అసంపూర్తిగా నిలిచిన నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంటిబాబు సందర్శించారు. ఎంపీ నిధులు రూ.5 లక్షలతో భవనాన్ని పూర్తి చేస్తామని ఎంపీ గీత తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ తోట రవి, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దోమాల గంగాధర్, కిర్లంపూడి సొసైటీ చైర్మన్ చదలవాడ బాబీ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బిళ్లకుర్తి నాగమణి, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట గాంధీ, పెంటకోట నాగబాబు, తోట విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

ప్రత్తిపాడు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ పిలుపు నిచ్చారు. స్థానిక సూర్య కన్వెన్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఇప్పటికే పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు అమలు చేయడంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లోనే ప్రత్తిపాడు నియోజకవర్గం ముందంజలో ఉందని చెప్పడంతో నాయకులు కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 4న నియోజకవర్గంలోని 83 సచివాలయాల పరిధిలో గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీ తదితరులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. 7 నుంచి 14 వరకు నియోజకవర్గంలోని 92,500 గృహాల తలుపు తట్టి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను మరోసారి ఎగురవేసేలా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, పార్టీ నాయకులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కుడుపూడి భరత్, ప్రత్తిపాడు, శంఖవరం ఎంపీపీలు గోళ్ల కాంతి సుధాకర్, పర్వత రాజబాబు, ఏలేశ్వరం, రౌతులపూడి జెడ్పీటీసీలు నీరుకొండ రాజకుమారి, గొల్లు దివాణం, ఏలేశ్వరం కౌన్సిలర్ అలమండ చలమయ్య, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఈగల అప్పారావు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు, అన్నవరం సర్పంచులు గుడాల విజయలక్ష్మి, శెట్టిబత్తుల కుమార్‌రాజా, అన్నవరం ట్రస్ట బోర్డు సభ్యుడు దోశె చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అన్నసమారాధన

కిర్లంపూడి: గ్రామ శివారులో వేంచేసిన వనదర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

బీజేపీ మండల అధ్యక్ష పదవికి 'మేకా' రాజీనామా

జగ్గంపేట: మండల బీజేపీ అధ్యక్షుడు మేకా వీరబాబు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని చూసి పార్టీలో చేరానని, జగ్గంపేట నియోజకవర్గంలో దానికి భిన్నంగా పరిస్థితులు ఉన్న కారణంగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

తుని రూరల్: నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శర్మ శుక్రవారం తెలిపారు. తుని రాజా మైదానంలో మధ్యాహ్నం మూడు గంటలకు తుని మండలంలో 1819 స్వయం సహాయక సంఘాల్లోని 18,418 మందికి రూ.16.03 కోట్లు, పట్టణంలో 683 సంఘాల్లోని 6815 మంది సభ్యులకు రూ.5.31 కోట్ల విలువైన నమూనా చెక్కులను మంత్రి దాడిశెట్టి రాజా అందజేస్తారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జగ్గంపేట: జగ్గంపేట–గోకవరం రోడ్డు లో చింతచెట్ల వద్ద శుక్రవారం జరిగిన ప్రమాదంలో చలపరెడ్డి రవితేజ (18) మృతి చెందినట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన చలపరెడ్డి రవితేజ శుక్రవారం రాత్రి మోటారు సైకిల్‌పై గోకవరం రోడ్డులో వెళుతుండగా ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవితేజ రోడ్డుపై పడిపోగా వెనక నుంచి వస్తున్న ట్రాక్టర్ అతని మీదుగా వెళ్లిపోయింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు రవితేజ ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేశాడని, మెట్టపై ఉన్న కాలనీలో నిర్మించుకున్న ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. మృతుదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు.

రీ సర్వేను వేగవంతం చేయండి

శంఖవరం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పురోగతని శుక్రవారం ఆయన సమీక్షించారు. సర్వేతో రైతులు మేలు జరుగుతుందన్నారు.

కేఎస్ఎస్‌వైతో రైతులకు మేలు

ప్రత్తిపాడు: కిసాన్ శ్రామిక్ సురక్ష యోజన (కెఎస్ఎస్‌వై) పథకం ద్వారా రైతులకు రూ.లక్ష బీమా అందించనున్నట్టు కిసాన్ శ్రామిక్ మిత్ర అసోసియేషన్ ఇన్‌చార్జి దివిలి సతీష్ తెలిపారు. ప్రత్తిపాడు రైతు భరోసా కేంద్రం సమీపంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కిసాన్ శ్రామిక్ మిత్ర అసోసియేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

మహిళా సంఘాల ఆర్థిక బలోపేతమే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ



జగ్గంపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు, డ్వాక్రా మహిళలు



ప్రత్తిపాడులో మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్

జగ్గంపేట: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక సాయిబాలాజీ ఫంక్షన్ హాలులో శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 1817 డ్వాక్రా గ్రూపులకు మంజూరైన రూ.16.39 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని డ్వాక్రా సంఘాల సభ్యులకు మూడు విడతలుగా ఆసరా సొమ్ము రూ.260 కోట్లను ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల ద్వారా నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.3 వేల కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ప్రజల నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా సంఘాల సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, జగ్గంపేట గ్రామ ఉపసర్పంచి బండారు రాజా పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రత్తిపాడు: రాష్ట్రంలో అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 1373 డ్వాక్రా సంఘాలల్లోని 13,591 మందికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10,55,88,949 నమూనా చెక్కును లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పర్వతను మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులు గజమాలతో సత్కరించారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.వెంకటాచలం, డిప్యూటీ తహసీల్దార్ కె.పద్మజ, అన్నవరం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దోశె చిట్టిబాబు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఏడిద రెడ్డినాయుడు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చిట్టిబాబు పాల్గొన్నారు.